గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


సీఎంను కలిసిన గోషామహల్ కాంగ్రెస్ నాయకులు ధన్‌రాజ్, సతీష్‌కుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తారని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, టి.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గోషామహల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని వారు కలిసి నియోజకవర్గ అభివృద్ధి చేపట్టాలని, నియోజకవర్గంలో సమస్యలపై మెమోరాండం అందజేశారు. అనంతరం ధన్‌రాజ్, సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. నియోజకవర్గంలోని సమస్యలన్నీ ఎప్పటికప్పుడు వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న ఆలయ ధర్మకర్తల పాలకమండలి ప్రతినిధులు

జియాగూడ: బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమని గౌండ్లమఠం సురాభాండేశ్వర ఆలయ ధర్మకర్తల పాలక మండలి అధ్యక్షుడు గౌడిశాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్, ముఖ్య సలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్ర భాస్కర్ గౌడ్, గోదా వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం కౌండిన్య హాల్‌లో సర్దార్ జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గడ్డమీది యగ్నేశ్వర్ గౌడ్, కోశాధికారి నిర్మల మనుజేందర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పంజలా అశోక్ కుమార్ గౌడ్, ధర్మకర్తలు దేశం శంకర హరిప్రసాద్‌గౌడ్, సాయినాథ్ గౌడ్, కొత్త ప్రవీణ్‌కుమార్ గౌడ్, ఎం.శివకుమార్ గౌడ్, గడ్డమీది నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

సన్మానం

నాంపల్లి: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ ముజాహిద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో కలిసి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టినందుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీని, రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కారులో చెలరేగిన మంటలు



సంతోష్‌నగర్: నడుస్తున్న ఓ కారులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగిన ఘటన సోమవారం కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పుగూడ వినాయకనగర్‌కు చెందిన ఎ.రాజు సోమవారం తన టాటా ఇండికా కారులో హయత్‌నగర్ నుంచి ఉప్పుగూడ ఇంటికి వెళుతున్నాడు. కాగా పిసల్‌బండ ఎస్‌బీఐ బ్యాంక్ ప్రాంతానికి చేరుకోగానే ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి హాని జరగలేదు. అనంతరం స్థానికులు మంటలను ఆర్పివేశారు.

సోమేశ్వరరావు సేవలు ఎనలేనివి


నివాళులర్పిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో నటుడు దుగ్గిరాల సోమేశ్వరరావు సంస్మరణ సభ సోమవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ.. రంగస్థల కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. రంగస్థల కళాకారుల సంక్షేమం, రంగ అభివృద్ధికి సోమేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ, రసరంజని కార్యవర్గ సభ్యులు సేనాపతి, రామకోటేశ్వరరావు, నటరాజ్, దుగ్గిరాల శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్


అక్బర్‌బాగ్, టోలిచౌకీ వాసులతో మహ్మద్ నజీబ్

గోల్కొండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని పీస్ ఫోర్స్ సొసైటీ నగర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం టోలిచౌకీలోని కార్యాలయం వద్ద ఆయన పలువురు చిరువ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చదువు ప్రాధాన్యతను ఆయన వారికి వివరించారు. తమ స్థోమతను బట్టి ప్రతిఒక్కరూ తమతమ పిల్లలను చదివించాలని ఆయన సూచించారు.

తోబుట్టువుల తోడుగా..

అనుబంధాలే రక్షగా..


విజయనగర్‌కాలనీలో..

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నాదమ్ముళ్లకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండగను పురస్కరించుకుని ఉదయం నుంచే మహిళలు రాఖీలు, స్వీట్ బాక్సులు కొనుగోళ్లతో మార్కెట్లు సందడి కనిపించాయి. అదే విధంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులకు మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం




వేడుకల్లో మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వరరావు, దీపేష్ రాజ్ వర్మ


షేక్‌పేట్‌లో..


బజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావుకు రాఖీ కడుతున్న దృశ్యం


గాజుల అంజయ్యకు రాఖీ కడుతున్న వినీషా


సాయిబాబాచారికి రాఖీ కడుతున్న సోదరీమణులు


బీజేపీ నాయకుడు శ్రీకాంత్‌చారి సోదరులకు రాఖీ కడుతున్న దృశ్యం


రాష్ట్ర ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు రాఖీ కడుతున్న సోదరి


సమద్ బిన్ అబ్దాద్‌కు రాఖీ కడుతున్న సరిత


యాకుత్‌పురాలో..


రెయిన్‌బో హోమ్‌లో..


హనుమాన్ నగర్‌లో..


మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ ఇంట్లో..

విధులు బహిష్కరించిన న్యాయవాదులు


మాట్లాడుతున్న సిటీ సివిల్ కోర్టు అధ్యక్షుడు శ్రీనివాసా చారి

యాకుత్‌పురా: న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈ నెల 24న రౌండ్ టెంబుల్ సమావేశం నిర్వహించనున్నామని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు అధ్యక్షుడు వై.శ్రీనివాసా చారి తెలిపారు. ఇటీవల బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు సోమవారం పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24న నిర్వహించనున్న సమావేశానికి హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్, సభ్యులు, రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, పలు పార్టీలకు చెందిన న్యాయవాద ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల లీగల్ సెల్ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్, సంయుక్తా కార్యదర్శి బర్క రాజేష్ కుమార్, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కో కన్వీనర్ ఏ.మాణిక్ ప్రభుగౌడ్, న్యాయవాదలు శివకుమార్ దాస్, అశోక్, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నూతన పైప్‌లైన్ పనులు చేపట్టామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. యాకుత్‌పురా, బడాబజార్, జాఫర్ రోడ్డు ప్రాంతాల్లో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సోమవారం ఆయన సంతోష్‌నగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పురాతన డ్రైనేజీ పైప్‌లైన్ శిథిలావస్థకు చేరుకోవడంతో నిత్యం ఈ ప్రాంతాల్లో మురుగు నీటి సమస్యలు తలెత్తున్నాయన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్, జీహెచ్‌ఎంసీ ఇంజినిరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

కళలతోనే జాతీయ సమైక్యత సాధ్యం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రావణ సౌరబాలు పేరిట సోమవారం రవీంద్రభారతిలో హాస్య, సంగీత, నృత్య విభావరిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్ మాట్లాడుతూ..జాతీయ సమైక్యత కళల ద్వారానే సాధ్యమన్నారు. సమాజంలో అనేక ఇబ్బందులు ఉన్నా సాంస్కృతిక సంస్థలు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం చిన్నారులను అభినందించారు. అదేవిధంగా సఖియా సాంప్రదాయ వస్త్రాధారణ ప్రదర్శన ఆకట్టుకోగా మోహన్‌కృష్ణ బృందం చేసిన హాస్యం నవ్వుల జల్లులను కురిపించాయి. ఈ కార్యక్రమంలో విజయవాడ ఇంటలిజెన్స్ ఎస్పీ, యు.రామ్మోహన్, సినీనటి సంధ్య, ఫ్యాషన్ డిజైనర్ కావ్యరెడ్డి, కతక్ నాట్యగురువు అంజిబాబు, ట్రస్టు వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీ పాల్గొన్నారు.


చిన్నారులతో సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్ తదితరులు

ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న గోషామహల్ కాంగ్రెస్ నాయకులు బజ్జుగోప్, జయశ్రీ

అబిడ్స్: ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బజ్జుగోప్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల పండగలను స్వయంగా చేపట్టేందుకు కృషి చేస్తుందన్నారు. చుడిబజార్ ప్రేమ్‌దాస్‌మఠ్‌లో శ్రావణ మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న బజ్జుగోప్ మహా శివుడికి అభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకురాలు జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న కళాశాల కార్యదర్శి కె.కృష్ణారావ్

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని హెచ్‌పీఈ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ హేమలత అన్నారు. గత రెండు రోజులుగా అబిడ్స్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జ్ఞానంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు ముఖ్యమని తెలిపారు. నేడు అనేక కంపెనీలు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయని తెలియజేశారు. టీ టెక్ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ జి.శ్రీరామ్, కళాశాల కార్యదర్శి కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు రాకేష్‌రెడ్డి, ఆర్.ప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపల్ సత్యప్రసాద్, డైరెక్టర్ వి.అనురాధ, కళాశాల డీన్ ఎ.వినయ్‌బాబు, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: దళితుల అభ్యున్నతి కోసం తాను ఎల్లప్పుడు ముందుంటానని ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం గన్‌ఫౌండ్రీలోని సూర్యలోగ్ కాంప్లెక్స్‌లో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ 5వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన తండ్రి వెంకటస్వామి నుంచి విషయాలు నేర్చుకోవడం వల్ల నేడు రాజకీయ, వ్యాపారవేత్తగా రాణించడానికి ఎంతో దోహదపడిందని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. దళితులు ఏ రంగంలో ఉన్నా అభివృద్ధి చెందాలని అందుకు తాను చేయూతనిస్తానని హామీ ఇచ్చారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిరుపేద విద్యార్థుల కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య, పార్లమెంట్ సభ్యులు ప్రసాద్‌రావు, ఐపీఎస్ అధికారి చేతన, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ చైర్మన్ గోపాల కృష్ణమూర్తి, ట్రస్టు చైర్మన్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గోల్కొండ: విద్యుత్ తీగలకు మరమ్మతులు, తదితర కారణాల వల్ల మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసీఫ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆలపాటినగర్ ఫీడర్‌లోని దిల్‌షాద్‌నగర్, ఎస్‌జీఐ కాలనీ, అరవింద్ కంటి ఆసుపత్రి, మిలన్ గార్డెన్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30 వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఆసిఫ్‌నగర్ మార్కెట్ యార్డు ఫీడర్ పరిధిలోని పద్మనాభనగర్, లక్ష్మీనగర్, సాయిబాబా ఆలయం, కరోల్‌బాగ్, బోజగుట్ట, పీఅండ్‌టీ కాలనీ, సత్యనారాయణనగర్, రూప్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, హకీంపేట్ కాలాబంగ్లా పరిధిలోని కాలాబంగ్లా, హకీంపేట్, పటేల్ గల్లీ, సనాహోటల్, గౌసియా మసీదు, ఎస్‌ఎస్‌ఎఫ్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఖాజిపురా, రూప్‌లాల్‌బజార్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- భయాందోళనలో స్థానికులు
- విద్యుత్ శాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు


ఖాజిపురాలో...


రూప్‌లాల్‌బజార్‌లో..

శాలిబండ: శాలిబండ డివిజన్ ఖాజిపురా, రూప్‌లాల్‌బజార్ రోడ్ల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజల భద్రతకు పెద్ద ముప్పుగా మారుతున్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు వర్షాకాలంలో అవి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. వర్షపు నీరు ట్రాన్స్‌ఫార్మర్‌లకు తగిలితే షాక్ వచ్చే ప్రమాదం ఉంది. ప్రతిరోజూ స్కూల్ పిల్లలు దాని పక్క నుంచి వెళుతుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి పాదచారులు, రోడ్ల పక్కన నడిచే వాళ్లు, ప్రతివారం జరిగే మార్కెట్‌కు వందలాది మంది వస్తుంటారు. ప్రతివారం మార్కెట్‌లో వచ్చే రద్దీ కారణంగా ప్రజలు ఈ ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన నడవడం తప్పనిసరి అవుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు మరింత ఎక్కువ అవుతాయని వ్యాపారస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడానికి స్థానిక అధికారులు, విద్యుత్ శాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ గోడలు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు పెట్టాలని పలువురు సూచించారు.

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో..



రూపులాల్ బజార్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. వందలాదిమంది బస్తీ దవాఖానాకు వచ్చే ప్రజలు, మైదానంలో ఉదయం పూట వాకింగ్ వచ్చేవాళ్లు ఉంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

– మహమ్మద్ షాహేద్ అలీ, వ్యాపారస్తుడు, రూప్‌లాల్ బజార్

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలి..



ఖాజీపురలో ట్రాన్స్‌ఫార్మర్ చూస్తే భయం వేస్తుంది. వర్షం పడితే అక్కడ నుంచి వెళ్లలేని పరిస్థితి. విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలి.

– మొహమ్మద్ ఇస్మాయిల్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఖాజీపుర

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


రామ్‌దాస్


తహస్సీమ్ అహ్మదీ

సంతోష్‌నగర్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రెయిన్‌బజార్ చమాన్‌కు చెందిన దుకాన్‌దాస్ ఈ నెల 11న బిహార్ బైసాలిలో నివాసముండే తన తండ్రి రామ్‌దాస్ (85)ను తనతో పాటు ఉండేందుకు తీసుకొచ్చాడు. ఈ నెల 18న రామ్‌దాస్ వాకింగ్ కోసమని వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుమారుడు దుకాన్‌దాస్ స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తన తండ్రి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో గృహిణి..

గృహిణి అదృశ్యమైన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ పిసల్‌బండ జీఎంనగర్‌కు చెందిన వికార్ అహ్మద్ కూతురు తహస్సీమ్ అహ్మదీ (46) ఈ నెల 16న ఉదయం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.